

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల--మోంగో డీబీ మధ్య అవగాహన ఒప్పందం మార్పిడి




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 247 పేజీలు - 08 వెల - 05/- బుధవారం 02-09-2026


## పేదల ఆర్థిక సాధికారతే

# లక్ష్యం.



నర్సాపురం పేదల సేవలో ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకు
- నదుల అనుసంధానంతో నీటి సమస్యకు పరిష్కారం
- గత పాలకులు బటన్ నొక్కారు.. రోడ్లకు గుంతలు పెట్టారు
- ఓటమి భయంతోనే గొడ్డలి పార్టీ ఏకగ్రీవాలు వద్దంటోంది

నర్సాపురం, సెప్టెంబరు1: పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని సీఎం చెప్పారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు పెంచిన పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.73,507 కోట్లను పెన్షన్ల రూపంలో పేదలకు అందించామని చెప్పారు. రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

### మహిళా సాధికారతకు పెద్దపీట





డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టి మహిళా సాధికారతకు బాటలు వేశామని చంద్రబాబు అన్నారు. ఏ ఆడబిడ్డా వంట కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దీపం పథకాన్ని తీసుకొచ్చామని, ఇప్పుడు దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈసారి లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు.

మిగతా 2లో

## ఉత్తరాంధ్ర

### చరిత్రలో అపురూప ఘట్టం

- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు
- నేడు పాయకరావుపేటలో జలాలకు హారతి ఇచ్చి విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు
- 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యం



ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేస్తూ గోదారమ్మ ఆ ప్రాంతంలోకి అడుగుపెడుతోంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లా వరకు పరుగులు పెడుతున్నాయి. నాలుగు నదులను, తూర్పు కనుమల కొండలను దాటుకుని వస్తున్న ఈ జలధార, ఉత్తరాంధ్ర బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు సిద్ధమైంది. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (సెప్టెంబరు 2) అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో గోదావరి జలాలకు 'జల హారతి' ఇచ్చి లాంఛనంగా విడుదల చేయనున్నారు.

మిగతాది 2లో

## హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు..



- హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు
- భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు
- గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు
- హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి
- సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ఫలితంగా కుదిరిన ఒప్పందాలు

హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

మిగతాది 2లో

## కల్వకుంట్ల కవితకు

### కౌంటర్ ఇచ్చిన వేముల ప్రశాంత్ రెడ్డి

- కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి
- కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి
- కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా



కష్టకాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట ఉన్నది ఎవరో కవిత తెలుసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. తనపై కవిత చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కవిత చర్యల వల్ల తండ్రి కేసీఆర్ ఎంతటి మనోవేదనకు గురవుతున్నారో ఆమె ఆలోచించుకోవాలని... తాను ఎప్పుడూ కేసీఆర్-కవితలను కలపడానికే ప్రయత్నించాను

మిగతాది 2లో

## ఒకే వేదిక పై

# భారత్, పాకిస్థాన్ ప్రధానులు

బిష్కెక్‌లో 26వ షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీ

- ఇతర దేశాధినేతలతో కలిసి గ్రూప్ ఫొటోలో పాలుపంచుకున్న ప్రధాని
- ఈ సందర్భంగా పాక్ ప్రధానితో కలిసి ఒకే వేదికపై కనిపించిన మోదీ
- కిర్గిజ్‌స్థాన్ అధ్యక్షుడితో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు
- ఉగ్రవాద రహిత ప్రాంతం కోసం కృషి చేయాలని ఎస్‌సీఓ సభ్యులకు పిలుపు



ప్రధాని నరేంద్ర మోదీ, కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ప్రాంతీయ కూటమి కీలక చర్చల్లో భాగంగా ఇతర దేశాధినేతలతో కలిసి ఆయన గ్రూప్ ఫొటోగ్రాఫ్‌లో పాల్గొన్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఇతర దేశాల నేతలతో కలిసి ఒకే వేదికపై ఫొటోలకు పోజిచ్చారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, కిర్గిజ్‌స్థాన్ అధ్యక్షుడు సాదిర్ జపరోవ్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్-కిర్గిజ్‌స్థాన్ మధ్య సంబంధాల పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత .

మిగతాది 2లో

## అక్షర ఆంధ్రతో

# 100% అక్షరాస్యత లక్ష్యం

బడిబయట ఉన్న 1.64 లక్షల మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశం



- పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష
- వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పక్కా ప్రణాళికలు
- అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని

మిగతాది 2లో

## ప్రభుత్వ హామీతో ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరించుకున్న సీజేపీ



- సెప్టెంబర్ 5న తలపెట్టిన ఢిల్లీ మార్చ్‌ను రద్దు చేసుకున్న సీజేపీ
- సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల హామీ
- నిరసనకారులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లు ఎత్తివేయనున్నట్టు వెల్లడి
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు 3 నెలల్లో పరిహారం
- ప్రభుత్వ హామీలకు కట్టుబడి ఉంటారని ఆశిస్తున్నట్టు సీజేపీ స్పష్టీకరణ

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన యాత్రను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సానుకూల హామీలు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్

మిగతాది 2లో

## పులివెందులలో జగన్ కు

### ఘనస్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు

- రెండు రోజుల పర్యటన నిమిత్తం పులివెందుల చేరుకున్న జగన్
- తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన వైసీపీ అధినేత



# ఒకే వేదికపై భారత్, పాకిస్థాన్ ప్రధానులు

(మొదటి పేజి తరువాయి)

ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, కిర్గిజ్‌స్థాన్



అధ్యక్షుడు సాదిర్ జపరోవ్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్-కిర్గిజ్‌స్థాన్ మధ్య సంబంధాల పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ చర్చల ద్వారా పరస్పర ప్రయోజనం ఉన్న రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారానికి మరింత ఊపు లభిస్తుందని భావిస్తున్నారు. అంతకుముందు ఎస్‌సీఓ సదస్సులో పాల్గొనేందుకు బిష్కెక్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి అక్కడి ప్రవాస భారతీయుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. 'భారత్ మాతా కీ జై', 'వందే మాతరం' నినాదాలతో వారు హోరెత్తించారు. ఈ సందర్భంగా ప్రవాసులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను, యోగా ప్రదర్శనలను మోదీ తిలకించి వారిని అభినందించారు. "భారత్ నుంచి బిష్కెక్‌కు.. ఈ సాయంత్రం భారత సమాజం నుంచి చాలా ప్రత్యేకమైన స్వాగతం లభించింది" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బిష్కెక్‌లోని మానస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కిర్గిజ్ రిపబ్లిక్ క్యాబినెట్ మంత్రుల ఛైర్మన్ ఆదిల్‌బెక్ కాసిమలియేవ్ ప్రధానికి స్వాగతం పలికారు. ఈ పర్యటనలో పలువురు నేతలతో ద్వైపాక్షికంగా సమావేశమవుతానని మోదీ తెలిపారు. 2017 నుంచి భారత్ ఎస్‌సీఓలో చురుకైన, నిర్మాణాత్మక సభ్య దేశంగా ఉందని తన పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో ప్రధాని గుర్తుచేశారు. "భద్రత, కనెక్టివిటీ, అవకాశాలు" అనే మూడు సూత్రాల ఆధారంగా ఈ ప్రాంతానికి సంబంధించిన భారత దార్శనికతను ముందుకు తీసుకెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం లేని ప్రాంతం కోసం ఎస్‌సీఓ సభ్య దేశాలతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు స్పష్టం చేశారు. మధ్య ఆసియాతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలనే భారత నిరంతర ప్రయత్నాల్లో ఈ సదస్సులో ప్రధాని భాగస్వామ్యం ఒక ముఖ్యమైన ఘట్టం.

# పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్‌ఎంఈలుగా ఎదిగారని, ఈసారి లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల్లో ఇంకా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఉందని సీఎం పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి న్యాయం చేశామని చెప్పారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలు, ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యా అవకాశాలకు పంపిస్తున్నామని తెలిపారు.

**బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్**

బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్ ఇస్తున్నాం అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ఆర్థికంగా వెసులుబాటు కలిగించామని చెప్పారు. గ్రామంలో ఇంకా పేదలు ఉన్నారంటే ఆ గ్రామానికే అవమానమని వ్యాఖ్యానించారు. ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీ4 ద్వారా జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని చంద్రబాబు తెలిపారు. శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం చెన్నకేశవస్వామి పాదాల వరకు నీరు పారించామని చెప్పారు. నల్లమల కొండల్లో సొరంగాలు తవ్వి నీటిని తరలించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి నీటిని ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని తెలిపారు. గోదావరి జలాలు తొలుత అనకాపల్లికి, వచ్చే ఏడాది విశాఖకు, ఆ తర్వాత వంశధార ప్రాంతానికి చేరేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నదుల అనుసంధానంతో దేశంలోని నీటి సమస్యలను పరిష్కరించాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు.

**పెట్టుబడులకు రాష్ట్రాన్ని గమ్య స్థానంగా మారుస్తాం**

గత పాలకులు పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేశారని సీఎం విమర్శించారు. దీనివల్ల యువత భవిష్యత్తు దెబ్బతిందన్నారు. ఇప్పుడు పెద్ద ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని తెలిపారు. విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ట్రూ డౌన్ ద్వారా విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతుకు అండగా నిలిచేందుకు విద్యుత్ యూనిట్ ను రూ.1.5 కే అందిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ మార్కెట్లలో ఇతర దేశాలతో పోటీ పడేలా ఆంధ్రప్రదేశ్ ఆక్వా ఉత్పత్తులను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ సేవలు అందించేలా వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుపైనా దృష్టి పెట్టామని తెలిపారు. నర్సాపురం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు , డెల్టా మోడర్నైజేషన్ వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

**ఎన్డీఏ కూటమికి తిరుగులేదు**

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమికి తిరుగులేదని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థలు బలంగా ఉంటేనే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు వార్డు సభ్యులు, సర్పంచులు కూడా పాలనలో భాగం కావాలన్నారు. అప్పుడే కేంద్రం నుంచి గ్రామీణాభివృద్ధికి నిధులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం అన్నారు. ఓటమి భయంతోనే ఏకగ్రీవాలను వద్దని గొడ్డలి పార్టీ నేతలు చెబుతున్నారని అన్నారు. ఏకగ్రీవాలను ప్రభుత్వాలే ప్రోత్సహించాయని. మున్సిపాలిటీలు, ఆయారాం- గయారాం అనే పరిస్థితి లేకుండా కార్పొరేషన్లలో చైర్మన్, మేయర్ల ఎన్నికను ప్రత్యక్షం చేశామని అన్నారు. గొడ్డలి పార్టీ నేతలు బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించేశారని సీఎం ఆక్షేపించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరక్కుండా అడ్డుకోవటమే గొడ్డలి పార్టీ ఆలోచన అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్ ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# అక్షర ఆంధ్రతో 100% అక్షరాస్యత లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా



వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

**బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలి**

పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే 33 వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను 'లీప్' యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపామని పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల హాజరు శాతం 98.97 శాతంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా పెంచాలని సూచించారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, ఈ బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీలకు అప్పగించాలని స్పష్టం చేశారు.

**ఇంటర్ విద్యలో పురోగతి**

ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని, గత ఏడాదితో పోలిస్తే సుమారు 10 వేల అడ్మిషన్లు పెరిగాయని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 'సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్' కింద ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు రూ.1051 కోట్లు అందించామని, మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా త్వరలో అందిస్తామని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ (ఊూాూా=) ఐడీ ఇంటిగ్రేషన్ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యతపై రాజీ లేదు**

మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నాణ్యతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు 'లీప్' యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ అందించాలని కోరారు. అలాగే, విద్యార్థుల్లో ఒత్తిడి లేని అభ్యసన వాతావరణాన్ని కల్పించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు 'ఏఐ సమర్థ్' కార్యక్రమం చేపడుతున్నామని, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 192 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల కోసం 'మిషన్ మార్చి-2026'పై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పులివెందులలో జగన్ కు ఘనస్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు

(మొదటి పేజి తరువాయి)

వైసీపీ అధినేత జగన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం పులివెందులకు చేరుకున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో సాగనున్న ఈ పర్యటనలో భాగంగా ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆయన పులివెందుల చేరుకోగా... హెలిప్యాడ్ వద్ద పార్టీ నాయకులు, స్థానిక శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా జగన్ భాకరాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. సొంత నియోజకవర్గం పులివెందులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ రాత్రికి ఆయన పులివెందులలోని తన స్వగృహంలోనే బస చేయనున్నారు. రేపు ఉదయం 7.45 గంటలకు జగన్ ఇడుపులపాయకు బయల్దేరి వెళతారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, నివాళులు అర్పిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన తాడేపల్లికి తిరుగు ప్రయాణం కానున్నారు.ం

## ఉత్తరాంధ్ర చరిత్రలో అపురూప ఘట్టం

(మొదటి పేజి తరువాయి)

నాలుగు నదులను, తూర్పు కనుమల కొండలను దాటుకుని వస్తున్న ఈ జలధార, ఉత్తరాంధ్ర బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు సిద్ధమైంది. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (సెప్టెంబరు 2) అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో గోదావరి జలాలకు 'జల హారతి' ఇచ్చి లాంఛనంగా విడుదల చేయనున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాదిలోనే అనకాపల్లికి నీళ్లు అందించి, కూటమి ప్రభుత్వం తన సంకల్పాన్ని నిలబెట్టుకుంది. మంగళవారం మధ్యాహ్నం 2:20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కాలువపై నిర్మించిన రెగ్యులేటర్‌ను ప్రారంభించి నీటిని విడుదల చేస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంతో ఉత్తరాంధ్ర సాగునీటి చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానుంది.

కొండలు, నదులు దాటిన ఇంజనీరింగ్ అద్భుతం గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించడం అనేది ఒక గొప్ప ఇంజనీరింగ్ అద్భుతం. ఈ ప్రయాణంలో పంపా, తాండవ, వరాహ, శారద వంటి నాలుగు నదులను, ఏలేరు కాలువను, తూర్పు కనుమలను దాటాల్సి వచ్చింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్లు వెచ్చించి అధునాతన సాంకేతికతతో నిర్మాణాలు చేపట్టింది. కొన్నిచోట్ల నదుల ప్రవాహానికి ఎగువన అక్విడెక్టులు, మరికొన్ని చోట్ల ప్రవాహానికి దిగువన సైఫన్లు నిర్మించారు. ముఖ్యంగా ఏలేరు నది గర్భం కింద నుంచి గోదావరి నీటిని తరలించేందుకు సైఫన్‌ను, పంపా నదిపై 30 మీటర్ల లోతు పునాదులతో భారీ అక్విడెక్టును నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 447 మీటర్ల పొడవున అక్విడెక్టు నిర్మాణం చేపట్టడం ఈ ప్రాజెక్టు సంక్లిష్టతకు నిదర్శనం. లక్షల ఎకరాలకు భరోసా.. భవిష్యత్తుకు మార్గం

ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనుంది. ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. దీంతోపాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. పుష్కర ఆయకట్టు కింద 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా, తాండవ, వరాహ తదితర ఆయకట్టుల కింద మరో 58,000 ఎకరాలకు పైగా భూమి స్థిరీకరణ జరగనుంది. వచ్చే ఏడాది నాటికి ఈ జలాలను విశాఖపట్నం వరకు పొడిగించి, ఆపై ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 213 కిలోమీటర్ల పొడవైన ఈ ఎడమ కాలువ ద్వారా మొత్తం 23.44 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెస్తారు. ఈ బృహత్తర ప్రణాళిక పూర్తయితే అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలతో సహా మొత్తం 8 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అంది, ఉత్తరాంధ్ర స్వరూపమే మారిపోనుంది.ం

## హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు..

(మొదటి పేజి తరువాయి)

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి. వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్?లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.

## కల్వకుంట్ల కవితకు కౌంటర్ ఇచ్చిన వేముల ప్రశాంత్ రెడ్డి

(మొదటి పేజి తరువాయి)

తాను, తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి 2001లో పార్టీ ఆవిర్భావానికి ముందే కేసీఆర్ వెంటే ఉన్నామని, తాము టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యులమని గుర్తుచేశారు. "బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్" అని పేర్కొన్న ఆయన... కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పార్టీ లైన్ దాటినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. అసెంబ్లీ లోపలా బయటా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిరంతరం పోరాడుతున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. తాను కాంగ్రెస్ నాయకులతో ఎలాంటి మంతనాలు జరపలేదని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ప్రమాణపూర్వకంగా చెప్పగలనని... మరి కాంగ్రెస్‌తో కవిత రహస్య మంతనాలు జరపలేదని ఆమె చెప్పగలరా? అని నిలదీశారు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తులుగా, బలంగా ఉన్న నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తూ... పార్టీని బలహీనపరిచి పరోక్షంగా అధికార కాంగ్రెస్ పార్టీకి కవిత లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. సభలో ఆమె కన్నీళ్లు పెట్టుకోవడం కేవలం రాజకీయం కోసం, సానుభూతిని పొందేందుకేనని విమర్శించారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీని చేయడంలో తన పాత్ర ఏంటో కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసని, నిన్నటి వరకు ఆమెపై ఉన్న గౌరవాన్ని తన వ్యాఖ్యలతో కవిత స్వయంగా పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ం

## ప్రభుత్వ హామీతో ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరించుకున్న సీజేపీ

(మొదటి పేజి తరువాయి)

కాలపరిమితిలోగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, జులై 20 నుంచి 25 మధ్య కాలంలో నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను తదుపరి విచారణకు తీసుకెళ్లబోమని, కొత్త కేసులు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. గతంలో సీజేపీకి ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ప్రభుత్వ హామీలపై సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ స్పందిస్తూ, "కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సానుకూల హామీలకు, వాటికి లభించిన న్యాయపరమైన భరోసాకు అనుగుణంగా సెప్టెంబర్ 5న తలపెట్టిన మార్చ్‌ను ఉపసంహరించుకోవడమే సముచితమని భావిస్తున్నాం. న్యాయస్థానం జారీ చేసిన తాజా ఉత్తర్వులకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. నీట్-యూజీ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో నిరసనకారులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని జులై 25న ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ సీజేపీ ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాగా, సీజేపీ తాజాగా తీసుకున్న నిరసన రద్దు నిర్ణయాన్ని జస్టిస్ సూర్యకాంత్ 'మంచి పరిణామం'గా అభివర్ణిస్తూ ప్రశంసించారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి. ఫరూక్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి. ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకుడు ఎన్ ఎం డి.ఫయాజ్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి 38వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతు రాష్ట్రం అంత కూడా గర్వించే విధంగా ప్రతినెల 1వ తేదిన పెన్షన్ పంపిణీ చేయడం ఎంతో గర్వించే విధంగా ఉంది అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు మరియు సచివాలయ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలి



మహానంది, పల్లె వెలుగు పంట నమోదైన రైతులు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం బొల్లవరం,తమ్మడపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ..రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు.ఈ కేవైసీ ని ఓటిపి, బయోమెట్రిక్ ద్వారా, స్వయంగా పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. రైతులు తమ పంట వివరాలను ఈ పంట వెబ్‌సైట్, ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా పరిశీలించి ధృవీకరించుకోవాలన్నారు. పంట నమోదు ధృవీకరణ, ఈ కేవైసీ పూర్తిచేసుకోవడం ద్వారా పంటల కొనుగోలు, ఎరువుల పంపిణీ,బీమా, నష్టపరిహారం పలు ప్రభుత్వ వ్యవసాయ సేవలు పొందేందుకు వీలుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, భవ్యశ్రీ, రైతులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు తహసిల్దార్ సూచనలు..



పాణ్యం సెప్టెంబర్ 01 పల్లె వెలుగు : మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు మరియు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ పలు సూచనలు.ఈ సంవత్సరం సూపర్ ఎల్ నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి,మన మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు.దీంతో పంటల సాగుకు, ప్రజల తాగునీటి అవసరాలకు, పశు పక్ష్యాదులు మరియు ఇతర జీవజాలానికి అవసరమైన నీటి లభ్యత తగ్గిపోయింది. అదేవిధంగా,రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ నిమజ్జనానికి అవసరమైన నీరు కుంటలు,చెరువుల్లో సమృద్ధిగా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. కావున, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అన్ని గ్రామాల ప్రజలు మరియు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సాధ్యమైనంత వరకు మట్టి వినాయక విగ్రహాలను, చిన్న పరిమాణంలో ఉన్న విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించుకొని పూజలు నిర్వహించవలసిందిగా తెలిపారు.పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి వనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత.ఈ పరిస్థితిని అర్థం చేసుకొని ప్రతి ఒక్కరూ సహకరించి, సాదాసీదాగా, భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహించుకుందాం అని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## 11 గ్రామపంచాయతీలో 108 పోలింగ్ స్టేషన్లో

దొర్నిపాడు సెప్టెంబర్1పల్లె వెలుగున్యూస్ దొర్నిపాడు మండలంలోని 11 గ్రామపంచాయతీలలో 108 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకుప్రతి గ్రామపంచాయతీలో పోలింగ్ స్టేషను గుర్తించి నోటీస్ బోర్డ్ నందువివరాలు ఉంచినట్లు ఆమె తెలిపారు, అన్ని గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను
పరిశీలించినట్లు ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, డి,ర్ డిప్యూటీ ఎంపీడీవో శివప్రసాద్ ఏవో జయప్రకాష్ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు



# స్వర్ణ గ్రామ, వార్డుల ద్వారా

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

● రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ● ఎమ్మిగనూరు, కడిమెట్లలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని 25వ వార్డు కార్యాలయాన్ని, మండల పరిధిలోని కడిమెట్ల-3 గ్రామ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టిక, రికార్డులు, సిబ్బంది పనితీరును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేరేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌వర్డ్, ఔట్‌వర్డ్, ఆర్టీఐ (=×), పీజీఆర్ఎస్ (గ్రా+=వా), ప్రాపర్టీ ట్యాక్స్, స్టాక్ తదితర రిజిస్టర్లను పక్కాగా నిర్వహించకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగుల హాజరు శాతం కనీసం 85 శాతానికి తగ్గకుండా ఉండాలని ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, పీజీఆర్ఎస్ క్యూఆర్ కోడ్ కలర్ ప్రింట్లను కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు.

పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలపై ప్రత్యేక శ్రద్ధ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకమని, డ్రైన్లు, మురుగు కాలువలను నిత్యం శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ఎక్కడా అంతరాయం కలగకుండా చూడాలని, మరమ్మతులకు గురైన వీధి దీపాల స్థానంలో



కొత్తవి ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తీవ్ర పౌష్టికాహార లోపం (=వాపీ), తక్కువ బరువు (అండర్‌వెయిట్), ఎదుగుదల లోపం ఉన్న చిన్నారుల వివరాలు మహిళా పోలీసుల వద్ద అందుబాటులో లేకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది క్రమం తప్పకుండా అంగన్‌వాడీలను సందర్శించి, లోపం ఉన్న పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఆర్డీవో అరుణాదేవి, స్వర్ణ గ్రామ-వార్డు అధికారి భాస్కర్ నాయుడు, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎంపీడీవో బంగారమ్మ, తహశీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

● '2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి--సంక్షేమం' పేరిట జోరుగా ఇంటింటి ప్రచారం ● ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే పరమావధిగా పాలన సాగిస్తోందని పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు. '2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా కల్లూరు అర్బన్ 37వ వార్డు పరిధిలోని ఎన్టీఆర్ బిల్డింగ్ ప్రాంతంలో ఆమె విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి స్వయంగా ప్రతి ఇంటికీ వెళ్లి



స్థానికులను ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పాలన ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో మెరుగైన సేవలు

● స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల్లో రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు, ● పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి, ● జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

ఎమ్మిగనూరు పల్లె వెలుగు, సెప్టెంబర్ 01 స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణం 25వ వార్డు లోని స్వర్ణ వార్డు కార్యాలయాన్ని, ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్ల -3 స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, కార్యాలయపు రికార్డులు, హాజరు పట్టిక, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామస్థాయి సేవల అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.. పీజీఆర్ఆర్ఎస్ కు సంబంధించిన క్యూఆర్ కోడ్ ను కలర్ ప్రింట్ రూపంలో అన్ని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు.. స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని



నిర్వహించాలన్నారు. స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు ఉద్యోగుల హాజరు శాతం కనీసం 85 శాతం లక్ష్యానికి తగ్గకుండా హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారుస్వర్ణ గ్రామ కార్యాలయంలో రిజిస్టర్లు, రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాలలో నిర్వహించాల్సిన ఇన్‌వర్డ్, ఔట్‌వర్డ్, హాజరు, సందర్శకుల వివరాలు, =×, ా+=వా, ప్రాపర్టీ ట్యాక్స్, స్టాక్ రిజిస్టర్ తదితర రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహించాలన్నారు. రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకమని, డ్రైన్లు, మురుగు కాలువలను ప్రతిరోజూ పరిశీలించి శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ పంచాయతీ సెక్రెటరీ ని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామంలో మరమ్మతులకు గురైన వీధి దీపాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో తీవ్ర పౌష్టికాహార లోపం (=వాపీ) ఉన్న చిన్నారుల సంఖ్య, పౌష్టికాహార లోపం, ఎదుగుదల లోపం (స్టంటింగ్), తక్కువ బరువు (అండర్‌వెయిట్) వంటి సమస్యలతో ఉన్న పిల్లల వివరాలు తెలియకపోవడం ఏంటని కలెక్టర్ మహిళ పోలీస్ ను ప్రశ్నించారు అంగన్‌వాడీ కేంద్రాలను సంబంధిత సిబ్బంది క్రమం తప్పకుండా సందర్శించి, పిల్లల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలన్నారు. ముఖ్యంగా తక్కువ బరువు ఉన్న పిల్లల విషయంలో ఇంటింటికీ వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడు, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎంపిడిఓ బంగారమ్మ, తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై

# కూటమి ప్రభుత్వం విఫలం.





పల్లె వెలుగు నంద్యాల రూరల్. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో సునీత ఒకేషనల్ జూనియర్ కాలేజీ నందు జిల్లా ప్రధమ మహాసభలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.7,000కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న హాస్టల్ ఆంక్షలు**

బీసీ వసతి గృహాలు రాష్ట్రవ్యాప్తంగా 54 హాస్టలు పూర్తిగా మూసివేసే నిర్ణయం ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా 10 బీసీ రెసిడెన్షియల్ తీసుకురావడంలో భాగంగానే ఇన్ని హాస్టలు మూసి వేయడం ఏమిటని అన్నారు. కాలేజ్ వసతి గృహాలకు ఎక్కడ కూడా సొంత బిల్డింగ్ లేకుండా అద్దె బిల్డింగ్ లోనే నడుపుతున్నారు తక్షణమే కాలేజ్ హాస్టళ్ల సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, పాత్రికేయులు వెళ్లకుండా ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని అన్నారు. హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను తెలుసుకునే హక్కు ను ఎవ్వరూ హరించలేరని, ఈ నిషేధాన్ని ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

**జీవో నెంబర్.77 పై విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహం**

జీవో నెంబర్.77ను తక్షణమే రద్దు చేసి ౹ా+ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ పునరుద్ధరించాలని కోరారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించకుండా అడ్డుకునే విధానాలను ప్రభుత్వం విడనాడాలని అన్నారు.

**హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి**

నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినప్పటికీ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను తగిన స్థాయిలో పెంచకపోవడం అన్యాయమని అన్నారు. అన్నా క్యాంటీన్లో 83 రూపాయలకు పెంచారు. జైల్లో ఉన్న ఖైదీలకు పౌష్టికమైన ఆహారం పెట్టాలని మెస్ చార్జీలు పెంచారు కానీ సాంఘిక సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రం ఎందుకు మెస్ చార్జీలు పెంచాలని ఆవేదన వ్యక్తంచేశారు.

**ప్రైవేట్ విద్యా దోపిడీకి అడ్డుకట్ట వేయాలి**

కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతున్నాయని విమర్శించారు. జీవో ఎంఎస్ నంబర్.1ను అమలు చేసి, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారులి .

**డీమ్డ్ యూనివర్శిటీలలో ప్రవేశాలు పారదర్శకంగా ఉండాలి**

ప్రైవేట్ డీమ్డ్ యూనివర్సిటీల ప్రత్యేక ప్రవేశ పరీక్షల పేరుతో విద్యార్థులపై అదనపు భారాన్ని మోపడం సరికాదని అన్నారు. జేఈఈ, మెయిన్స్, ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పించాలని, యూనివర్సిటీలు ప్రత్యేక ప్రవేశ పరీక్షలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఎన్ టి ఏ ను రద్దు చేయాలి**

నీట్, ఇతర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో ఎన్ టి ఏ పై విద్యార్థుల్లో నమ్మకం పోయింది అని ఎన్ టి ఏ ను రద్దు చేసి, నీట్ ఇతర పోట్టి పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించాలన్నారు.

ఎన్ టి ఏ -యు జి సి, నీట్ పేపర్ లీక్ లీక్ అవడం ద్వారా ఇంగ్లీష్, కామర్స్, సోషియాలజీ పరీక్షలు మరో సారి నిర్వహిస్తామని తెలిజేయడం ద్వారా అనేక మంది విద్యార్థులు నష్టపోయారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూదో అర్థమవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఎన్ టి ఏ ను రద్దు చేయాలని అన్నారు.

**ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి**

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయకుండా ఉన్నత విద్యా ప్రమాణాలను ఎలా పెంచుతారని ప్రశ్నించారు. ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించాలి కోరారు .

**విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.**

విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే విద్యార్థి లోకం చూస్తూ ఊరుకోదని యు ఎస్ ఎఫ్ ఐ నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల కోసం దశలవారీగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, జిల్లాకార్యదర్శి సురేంద్రనాయక్, ఆళ్లగడ్డ నియోజవర్గ అధ్యక్షుడు సంతోష్, బనగానపల్లె అధ్యక్షుడు శివ మరియు విద్యార్థి నాయకులు కార్తీక్, దినేష్, యువరాజ్, మద్దిలేటి, శీనుతదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌లో విశిష్ట సేవలకు జిల్లా కలెక్టర్ రాజకుమారికి

# గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం.

**బ్లడ్ స్టోరేజ్ యూనిట్, జన ఔషధి కేంద్రం, 'మీ ఇంటికి మీ డాక్టర్' వంటి సేవలకు గుర్తింపు.**









పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన రెడ్‌క్రాస్ బంగారు పతకం, ప్రశంసా పత్రం లభించింది. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో 2024-25 సంవత్సరానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రెడ్‌క్రాస్ ద్వారా విశిష్ట సేవలు అందించిన కలెక్టర్లను గవర్నర్ సత్కరించారు.

నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ఏర్పాటు, ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం ప్రారంభం, 'మీ ఇంటికి మీ డాక్టర్' కార్యక్రమం అమలు తదితర ప్రజోపయోగ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు కలెక్టర్ రాజకుమారికి ఈ పురస్కారం లభించింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా కొత్తగా ఏర్పడిన సమయంలో రెడ్‌క్రాస్ సొసైటీకి సొంత భవనం, బ్లడ్ స్టోరేజ్ యూనిట్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితి నుంచి ప్రస్తుతం ప్రజలకు అనేక సేవలు అందించే స్థాయికి తీసుకురావడం జరిగిందన్నారు. వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పాత జపాన్ ప్రాజెక్టు భవనాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి కేటాయించి, అవసరమైన ఆధునీకరణ పనులు చేపట్టి సొంత భవనంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజలకు అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో ఉండేలా ఫ్రీజర్లు, ఏసీలు, ల్యాబ్ టెక్నీషియన్ తదితర సదుపాయాలతో బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. యువత, మహిళల్లో రక్తదానంపై విస్తృత అవగాహన కల్పించి, ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసేలా ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

రెడ్‌క్రాస్ భవనానికి విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు నీడ్ క్యాప్ మార్గదర్శకత్వంలో పూర్తిస్థాయి సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా జి జి హెచ్ ఆవరణలో స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తల సహకారంతో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో డోన్, శ్రీశైలం ప్రాంతాలతో పాటు ఎన్ హెచ్-40, ఎన్ హెచ్-340సి జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ బ్లడ్ స్టోరేజ్ యూనిట్లు, జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై.డి. రామారావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ, సీఈఓ అశ్విని కుమార్ ఫరీదా (రిటైర్డ్ ఐఏఎస్), రాష్ట్ర వైస్ చైర్మన్ పి.ఆర్.సి. రాజు, నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, ఉస్మాన్ భాషతో పాటు రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల--మోంగో డీబీ

# మధ్య అవగాహన ఒప్పందం మార్పిడి

నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 01. (పల్లె వెలుగు ):విద్యార్థులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాంతిరామ్




ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్), నంద్యాల మరియు ప్రపంచ ప్రఖ్యాత డేటాబేస్ ప్లాట్ఫామ్ మోంగో డీబీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంథిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు మరియు మోంగో డీబీ ప్రతినిధులు ఎమ్ఓయూ ను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ఆధునిక డేటాబేస్ టెక్నాలజీలు, క్లౌడ్ ఆధారిత డేటా మేనేజ్మెంట్, పరిశ్రమకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు మోంగో డీబీ అకాడెమీ శిక్షణ, వర్క్షాప్లు, సర్టిఫికేషన్ కార్యక్రమాలు, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం మరియు పరిశ్రమకు అనుగుణమైన నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ, పరిశ్రమ--విద్యాసంస్థల మధ్య ఇటువంటి భాగస్వామ్యాలు విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారిని ఉద్యోగ రంగానికి సిద్ధం చేయడంలో ఈ ఎమ్ఓయూ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్), నంద్యాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

## నాణ్యతతో కూడిన రుచికరమైన

## భోజనాన్ని అందించాలి జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి


పల్లె వెలుగు కర్నూలు బ్యూరో అన్న క్యాంటీన్ల ద్వారా ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం



ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్న క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, సేవలను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వారితో కలెక్టర్ మాట్లాడుతూ భోజనం ఎలా ఉంది, సరిపడేంతగా పెడుతున్నారా, ప్రతిరోజూ సమయానికి క్యాంటీన్‌ను తెరుస్తున్నారా, క్యాంటీన్‌లో పరిశుభ్రత, నిర్వహణ ఎలా ఉందని ఆరా తీశారు... భోజనం చాలా రుచిగా ఉంటుందని, సరిపడేంత పెడుతున్నారని, సమయానికి అన్న క్యాంటీన్ తెరుస్తున్నారని, అన్న క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతున్నారని భోజనం చేస్తున్న ప్రజలు కలెక్టర్ కి వివరించారు.. అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. కార్యక్రమంలో ఆదోని ఆర్డీవో అరుణ దేవి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు..

# పరిహాసం దాటి.. ప్రగతి వైపు

పల్లె వెలుగు ఓ మనిషీ.. నీ విజయాలను ఓర్వలేని వారు కొందరు. నీ ప్రతి కదలికను, ప్రతి



అడుగును తప్పుపట్టే కుటిలులు కొందరు. నీ గుండెల్లోని గాయాలను చూడకుండా పరిహసించే నిర్దయులు కొందరు. నీ ప్రతిభను గుర్తించకుండా అపహాస్యం చేసే అజ్ఞానులు మరికొందరు. ఎగతాళి చేసేవారితో సంబంధాలు తెంచుకో. నీ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగిపో. నీ కన్నీటిని తుడిచే కరుణ ఉన్న హృదయాలను వెతుక్కో. నీ మౌనంలోని బాధను గ్రహించే మనుషులను ఆశ్రయించు. నీ కష్టాల కడలిలో తోడుగా నిలిచేవాళ్లే నిజమైన బంధువులు. నీ గెలుపును చూసి నీకంటే మిన్నగా మురిసిపోయేవారే నీ హితులు. నిన్ను ఆదరించే వారితో ఆత్మీయతను పెంచుకో. లోకుల విమర్శలు నీ ప్రయాణాన్ని అడ్డుకునే శక్తిగా కాకుండా.. నీవు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తోడ్పడే సోపానాలుగా మార్చుకో. నిన్ను తక్కువ చేసే మనుషుల నీడను సైతం వదిలేయ్. నిన్ను గౌరవించే సజ్జనుల సాంగత్యంలో నీ సామ్రాజ్యాన్ని నిర్మించుకో. ఎవరికోసమో నీకు నువ్వు తగ్గించుకోకు. నీ వ్యక్తిత్వాన్ని వదులుకోకు. ధైర్యం, సాహసం, సంకల్పం, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకెయ్యి. అవే నిన్ను విజయ తీరాలకు చేరుస్తాయి. -- నేదునూరి కనకయ్య రచయిత, కాలమిస్ట్, కరీంనగర్

## తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం, విధుల్లో చేరిక

దొర్నిపాడు సెప్టెంబర్ 1 పల్లెవెలుగు న్యూస్ దొర్నిపాడుమండలంలోనిదొర్నిపాడు ,కిష్టిపాడు, కొత్త పల్లె చాకరాజు వేముల ,గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలతో పాటు మూడు జెడ్పీ



పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ ,ఇంగ్లీష్ సోషల్, సబ్జెక్టులలో తాత్కాలిక పద్ధతిపై విద్యను బోధించడానికి దరఖాస్తు చేసుకున్న వారిలో ఏడు మందిని ఉన్నతాధికారులు ఎంపిక చేసినారు, ఎంపికైన వారు మంగళవారం నియామక పత్రాలతో విధుల్లో చేరినట్లు మండల విద్యాధికారి మనోహర్ రెడ్డి తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక ఉపాధ్యాయు లుగ విధుల్లో చేరిన వారు సెప్టెంబర్ 2026 నుండి ఏప్రిల్ 2026 వరకు అనగా 8 నెల కాలం పని చేయుటకు నియామకం చేశామన్నారు,ఎస్, జి, టి ఉపాధ్యాయులకు పదివేల రూపాయల గౌరవ వేతనం స్కూల్అసిస్టెంట్ఉపాధ్యాయులకు12,500రూపాయలగౌరవవేతనాన్నిప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు, ఎస్ జి టి ఉపాధ్యాయునిగా జయశ్రీ చాకరాజు వేముల బీసీ పాఠశాల డి హుస్సేన్ బి, రెగ్యులర్ పాఠశాలకు,జిరాజేశ్వరి హిందీ దొర్నిపాడు జడ్పీ పాఠశాల ఉస్మాన్ అలీ హిందీ కొత్తపల్లి అబ్దుల్ సలీం హిందీ, కిష్టిపాడు జడ్పీ,సుధాకర్ ఇంగ్లీష్ దొర్నిపాడు జడ్పీ,పి శేఖర్ సోషల్ కిష్టిపాడు జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయు లుగవిధుల్లో చేరినట్లు తెలిపారు

## ఇంటి వద్దకే 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లు!

- లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన గౌరు జనార్దన్ రెడ్డి
- కల్లూరు అర్బన్ 35వ వార్డులో ఘనంగా కార్యక్రమం
- కూటమి ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం: యువ నాయకులు గౌరు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు అర్బన్ పరిధిలోని 35వ వార్డు సుంకులమ్మ ఆలయ



సమీపంలో 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గ యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ నగదును అందజేశారు.

ఈ సందర్భంగా గౌరు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, వారి గుమ్మం వద్దకే వెళ్లి గౌరవప్రదంగా పింఛన్లు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. పింఛన్ అందుకున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న భరోసా పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రముఖులు మరియు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై నిరంతర నిఘా, పర్యవేక్షణ ఉండాలి

● ప్రతి టిప్పర్ ట్రాక్టర్కు నెంబర్ లేకుంటే చర్యలు ,,,, ● డ్రైవర్లకు ప్రతి ఒక్కరికి లైసెన్ డ్రస్ ధరించాలి,,,,, ● రోడ్లపైన అతివేగంతో ప్రయాణం చేస్తే నిఘా పెడతా,,,, ● జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

నందవరం పల్లె వెలుగు సెప్టెంబర్ 01 ఇసుక అక్రమ రవాణాపై నిరంతర నిఘా,





పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి డా.ఏ.సిరి గనుల శాఖ డిడి ని ఆదేశించారు.. మంగళవారం నందవరం మండలంలోని గంగవరం, జోహరాపురం ఇసుక రీచ్ల ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్ నుండి బిల్స్ లేకుండా రవాణా జరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో ప్రతి డిస్పాచ్ను ప్రత్యేకంగా ధృవీకరించాలని, రోజువారీగా జరిగే రవాణాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ గనుల శాఖ డిడి ని ఆదేశించారు.. ఇసుక రీచ్ల నుంచి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణలపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, మైనింగ్ శాఖ డిడి నాగిని, తహసిల్దార్ వాహబ్, ఎంపిడిఓ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ కొండంత అండ.

### బిలకలగూడూరులో పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

పల్లె వెలుగు గడివేముల. వృద్ధులు, దివ్యాంగులు,



వితంతు తదితర అర్హులైన పింఛన్ దారులకు ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ కొండంత అండ అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

మంగళవారం నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ వెయ్యి రూపాయలు పెంచేందుకు



వైసీపీ అధినేత జగన్ ప్రభుత్వంకు ఇదేళ్ళు పట్టిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారం లోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన వెయ్యి రూపాయల ప్రకారం మూడు నెలల మూడు వేలు, పెంచిన నాలుగు వేలు, మొత్తం రూ. 7 వేలు అర్హులైన వారికి పంపిణీ చేశారని, దివ్యాంగుల మూడు వేల పెన్షన్ రెట్టింపు చేసి నెలకు ఆరువేల రూపాయలు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని, 100 శాతం వికలత్వం ఉన్న దివ్యాంగులకు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన బాధితులకు నెలకు రూ. 10 వేలు ప్రతి నెల ఇంటి వద్దకే వచ్చి ఇస్తుంది మా మంచి ఉమ్మడి ప్రభుత్వం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేసి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నాననీ, పేద, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో చేరేలా కృషి చేయడం మా ప్రభుత్వ బాధ్యత అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఈ కార్యక్రమంలో గడివేముల తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవగుప్త, ఏ ఓ పవన్ కుమార్, టీడీపీ నాయకులు, మాజీ జడ్పీటీసీ కో -ఆప్షన్ సభ్యులు రఫిక్, గ్రామ టీడీపీ నాయకులు జయంత్ రెడ్డి, యుగంధర్, మాజీ ఎంపీటీసీ భాస్కర్, కె. బొల్లవరం బాబుల్ రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ మాలిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ బైక్స్,స్కూటీస్ వాడుదాం పర్యావరణాన్ని కాపాడుదాం ..

**ఉప్పరి దస్తగిరి .ఇ.వి. పవర్ మాక్స్ కంపెనీ ఎండి. నంద్యాల, కర్నూల్..**




గడివేముల పల్లె వెలుగు దినపత్రిక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ఎలక్ట్రానిక్ వాహనాలను వాడదాం ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీఎస్) వలన పర్యావరణానికి చాలా మరియు వ్యక్తిగతంగా మనకు అనేక ఉపయోగాలు గురించి ఆయన పల్లె వెలుగు దినపత్రికతో పలు సూచనలు సందేహాలు తెలియజేశారు.

ఇ.వి. పవర్ మాక్స్ ఎండి .దస్తగిరి మాటల్లో......

పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న ప్రస్తుత కాలంలో ఇవి చాలా లాభదాయకంగా మారుతున్నాయి.ఎలక్ట్రిక్ వాహనాల ప్రధాన ప్రయోజనాలు క్రింది విధంగా ఉన్నాయి:ఆర్థిక ప్రయోజనాలుతక్కువ

**నిర్వహణ ఖర్చు:**


ఎలక్ట్రిక్ వాహనాలలో ఇంజిన్, గేర్బాక్స్ వంటి సంక్లిష్టమైన భాగాలు ఉండవు. అందువల్ల సర్వీసింగ్ ఖర్చులు చాలా తక్కువ.ఇంధన పొదుపు: పెట్రోల్, డీజిల్తో పోలిస్తే విద్యుత్ ఛార్జింగ్ ఖర్చు చాలా తక్కువ. ఇది మీ నెలవారీ ప్రయాణ ఖర్చులను భారీగా తగ్గిస్తుంది.పన్ను

**మినహాయింపులు:** ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు, రోడ్ టాక్స్ తగ్గింపు మరియు సబ్సిడీలను అందిస్తోంది.పర్యావరణ ప్రయోజనాలుశూన్య ఉద్గారాలు (ఏది ఉండదు): ఈ వాహనాలు నడుస్తున్నప్పుడు పొగను విడుదల చేయవు. దీనివల్ల గాలి కాలుష్యం గణనీయంగా తగ్గుతుంది.శబ్ద కాలుష్యం ఉండదు: ఎలక్ట్రిక్ వాహనాలు చాలా నిశ్శబ్దంగా నడుస్తాయి. ఇవి నగరాల్లో, గ్రామాలలో పట్టణాలలో శబ్ద కాలుష్యాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.మెరుగైన సాంకేతికత మరియు సౌకర్యంఉత్తమ పనితీరు ఎలక్ట్రిక్ వాహనాలు యాక్సిలరేటర్ నొక్కిన వెంటనే వేగాన్ని అందుకుంటాయి. వీటి డ్రైవింగ్ అనుభవం చాలా స్మూత్గా ఉంటుంది.ఇంట్లోనే ఛార్జింగ్: పెట్రోల్ బంకుల చుట్టూ తిరిగే పని లేకుండా, రాత్రి సమయంలో మీ ఇంట్లోనే మొబైల్ లాగా వాహనాన్ని ఛార్జ్ చేసుకోవచ్చు.మీరు ఎలక్ట్రిక్ వాహనాన్ని కొనుగోలు చేయాలని ఆలోచిస్తున్నారా? మీ అవసరాలకు తగినట్లుగా టూ వీలర్ (స్కూటర్) లేదా బైక్ లో ఏది మంచిదో తెలుసుకోవడానికి మన నంద్యాల జిల్లా చుట్టుపక్కల గ్రామాల వారు ఈ వాహనాలు వాడడం వలన పర్యావరణాన్ని రక్షించడంతోపాటు కాలుష్య నియంత్రణతో పాటు సురక్షితమైన భయపయానము అందించడమే కాకుండా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కేవలం 5000 రూపాయలను అడ్వాన్స్ చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చు ఇప్పుడు మన నంద్యాల ఈ.వి .పవర్ మ్యాక్స్ ఆఫీస్ నంద్యాల కరెంటు ఆఫీస్ ఎదురుగా ఉన్నది ఇక్కడ ప్రతి శనివారం సాయంత్రం 3.30 గంటలకు సమావేశం ఏర్పాటు జరుగుతుంటుంది, సలహాలు సందేహాలు కొరకు ఈ సమావేశానికి ఉచితంగా హాజరు కావచ్చును,మరిన్ని వివరాలకు సంప్రదించవలసిందిగా తెలియజేయడమైనది, ఆఫీస్ సెల్ నెంబర్స్ 7993343115,9542419659,9642408057 , 7013302717 , 9381704582,9392884944,,పైన తెలిపిన నెంబర్లను సంప్రదించవచ్చును..

## సూక్ష్మ పువ్వుల చిత్రాలతో రాజన్న చిత్రం

### నవ్వుల రాజు కు పుష్పాంజలి

నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 01. (పల్లె వెలుగు ):నంద్యాల కు చెందిన ప్రముఖ చిత్రకారుడు కళారత్న చింతలపల్లె కోటేష్ వై యస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని 12 అంగుళాల పొడవు,8 అంగుళాల వెడల్పు గల చిన్న డ్రాయింగ్ చార్టు మీద మైక్రో పెన్నులతో ఎటువంటి గీతలు లేకుండా వినూత్నంగా సూక్ష్మ పువ్వుల చిత్రాలను వేస్తూ రాజన్న చిత్రాన్ని వేసి ఆ మహా నీయునికి పుష్పాంజలి అర్పించారు. ఈ చిత్రం వైస్సార్ తన ధైన శైలి లో నవ్వుతున్నట్లు వేశారు. ఈ చిత్రం వేయడానికి 5 గంటల సమయం పట్టిందన్నారు. ఈ చిత్రంలో లెక్క లేనన్ని వేలాది రక రకాల సూక్ష్మ పువ్వులతో కలర్స్ లో వేసారన్నారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ వైస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసారు.1467 కిలోమీటర్లు పాదయాత్ర చేసి పేద, మధ్య తరగతి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.2004లో ముఖ్యమంత్రి పదవి చేపట్టి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి మంచి పరిపాలన అందిచ్చారు.2009లో మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. అయితే రెండో సారి కేవలం ముఖ్యమంత్రి అయిన మూడు నెలలకే సెప్టెంబర్ 2 న చిత్తూరు జిల్లాలో ఒక రచ్చబండ కార్యక్రమానికి వెళ్తూ హెలికాప్టర్ ప్రమాదం లో మరణించారు.ఆయన మరణం కోట్లాది ప్రజలకు తీవ్ర వేదనకు గురి చేసింది. భారత దేశంలోనే గర్వించదగ్గ మంచి నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజా శ్రేయస్సు కోసమే పుట్టిన నాయకుడు. పేద వాడి గుండె చప్పుడు విన్నాడు. సామాన్య ప్రజల సమస్యలు , రైతుల కష్టాలు చూసారు కాబట్టే అనేక సంక్షేమ పథకాలు పెట్టి అందరి హృదయాల్లో సజీవంగా వున్నారు. ఆయన అభిమాని గా వినూత్నం గా ఈ చిత్రం వేసాను. నవ్వులను పువ్వులతో పోల్చడం సహజం. పోల్చడానికి కారణం ఏమంటే వికసించిన పూలను చూడగానే మనసుకు ఎంతో ఆనందం కలుగుతుందో ఒకరి ముఖం లో నవ్వును చూసినప్పుడు అంతే ఆనందం కలుగుతుంది. అలాగే మన రాజన్న నవ్వు వికసించిన పువ్వుల వలె ఉంటుంది. రాజన్న చెరిగి పోని నీ నవ్వు ఈ లోకం వున్నంతవరకుసజీవంగా ఉంటుంది.వైస్సార్ అభిమానంతో ఆయన జయంతులకు, వర్ధంతులకు ఆయన చిత్రాన్ని వినూత్నం గా వేస్తూ నివాళులు అర్పిస్తూ వుంటాను. ఈ సారి ఇలా వేసాను. జై. వైస్సార్ జై జై వైస్సార్.జై రాజన్న.



# బండి ఆత్మకూరు వేదికగా

## సాగు (తాగు )నీటి కోసం రోడ్డెక్కిన రైతులు, వైసీపీ నేతలు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 1 : సాగు తాగునీటి కోసం వైసిపి నాయకులు వేలాదిమంది అన్నదాతలతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. బండి ఆత్మకూరు బస్టాండ్ నే వేదికగా చేసుకొని శ్రీశైలం, నంద్యాల,నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా రవి కిషోర్ రెడ్డి వైసీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి వెలుగోడు రిజర్వాయర్ ను మంగళవారం ముట్టడించేందుకు రైతులకు పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులకు ముందస్తు అనుమతి లేదంటూ పోలీసులు ట్రాక్టర్ యజమానులకు పార్టీ ప్రధాన నాయకులకు మూడు రోజుల క్రితమే నోటీసులు జారీచేశారు. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ ముట్టడించే క్రమం ఆందోళనకరంగా మారింది. ఒకవైపు మాజీ ఎమ్మెల్యేలను ముందస్తుగా అరెస్టు చేస్తారని ప్రచారం జరిగింది. ఈ సమాచారంతో ఇరువురు మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నుండి అదృశమయ్యారు. బండి ఆత్మకూరులో ఓ పార్టీ నాయకుడి ఇంట్లో తలదాచుకున్నారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇరువురు మాజీ ఎమ్మెల్యేలు అక్కడినుండి బయటికి వచ్చి మోటర్ సైకిల్ పై వెళ్ళిపోతుండగా పోలీసులు వెంటనే ఈ విషయాన్ని గుర్తించి వారిని అనుసరించారు. బండి ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఉన్న వంతెన పై చక్రపాణి రెడ్డి రవి కిషోర్ రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలోనే కొద్దిసేపు కార్యకర్తల మధ్య పోలీసుల మధ్య తోపు లాట జరిగింది. పోలీసులు తమను అడ్డుకోవడంతో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి కిషోర్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తాము పోరాటం చేస్తుంటే పోలీసులు అడ్డు తగలడం భావ్యంగా లేదని అన్నారు. ప్రతి విషయానికి అనుమతులు లేవంటూ మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. రైతుల కోసమే తాము పోరాటం చేస్తున్నామని, పోలీసులు కూడా రైతు కుటుంబాల నుంచి వచ్చామన్న విషయాన్ని గుర్తించాలని, ఆందోళన కార్యక్రమంలో తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు









విజ్ఞప్తి మేరకు ఆందోళన కార్యక్రమానికి సడలింపు ఇవ్వడంతో, బండి ఆత్మకూరు బస్టాండ్ లోని చక్రపాణిరెడ్డి రవి కిషోర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పి పి నాగిరెడ్డి జిల్లా వైఎస్ఆర్ పార్టీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజం రెడ్డి సుజాతమ్మ, వైయస్సార్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికళా రెడ్డి, తదితరులు కూడా రోడ్డుపై బైఠాయించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని భగ్నం చేయాలని పోలీస్ యంత్రాంగం ప్రయత్నాలు చేసినప్పటికీ, కార్యకర్తలు, అన్నదాతల జన సందోహం ముందు నిలువరించలేకపోయారు. దాదాపు రెండు గంటలపాటు రోడ్డుపై నాయకులు రైతులు బైఠాయించడంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. పోలీసులు ట్రాక్టర్లను నిలిపివేసిన కారణంగా, రైతులు కార్యకర్తలు మోటారు సైకిళ్లపై వెలు గోడు రిజర్వాయర్ కు చేరుకోవాలని, తాను మాత్రం రైతులతో కలిసి నడుచుకుంటూ వస్తానని చక్రపాణి రెడ్డి రైతులకు సూచించారు. 11 గంటల ప్రాంతంలో నంద్యాల ఏఎస్పి సుస్మిత రంగనాథన్ బండి ఆత్మకూరు కు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి నాయకులతో మాట్లాడి ఏఎస్పీ వెళ్లిపోయారు. అంతకంటే ముందు ఎమ్మెల్యే శిల్పా రవి కిషోర్ రెడ్డి వెలుగోడు మండలం మోత్కూరు గ్రామానికి చేరుకున్నారు. శిల్పా తనయుడు కార్తీక్ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం ఇన్చార్జి భువనేశ్వర్ రెడ్డి, రైతులతో కలిసి మోత్కూరు గ్రామం వద్ద రోడ్డుపై బైఠాయించారు. ఆత్మకూరు బీఎస్పీ రామాంజి నాయక్, వెలుగోడు ఎస్ఐ సురేష్ అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించారు. వెలుగోడు రిజర్వాయర్ ను ముట్టడించేందుకు ముందస్తు అనుమతి లేదు కాబట్టి వైసీపీ నాయకులను రైతులను నిలిపివేయడం జరిగిందని ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ పేర్కొన్నారు. మాజీ శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి తదితర నాయకులతో కలిసి ముందుగానే వెలుగోడుకు చేరుకున్నారు. అయితే రైతులు నాయకులు వెలుగోడు మండలం మోత్కూరు వద్ద బైఠాయించడంతో పోలీసులు వారిని కదలనియకుండా చేశారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి కిషోర్ రెడ్డి మోత్కూరు వద్దకు చేరుకొని రైతులతో కలసిఆందోళనలో పాల్గొన్నారు. కళ్ళ ముందర నీళ్లు ఉన్నప్పటికీ నంద్యాల జిల్లాలో ఎండిపోతున్న పంటలకు నీళు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని శిల్పా రవి ఆరోపించారు. ఎండిపోతున్న పంటలకు నీళ్లు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని ప్రభుత్వం మెడలు వంచి అయినా, రైతులకు నీళ్లు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తన నియోజకవర్గానికి యదేచ్ఛగా నీళ్లు తీసుకుపోతున్నారని ఆరోపించారు. మరో మంత్రి నంద్యాలలో ఉన్నప్పటికీ ఏమాత్రం ప్రయోజనం లేదని, రైతులకు నీళ్లు ఇచ్చే విషయంలో ఆ మంత్రి ఏమాత్రం నోరు మెదపడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంజీవరెడ్డి, పార్టీ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, పార్నపల్లి షబ్బీర్, మాజీ జెడ్పిటిసి సభ్యులు లాలు స్వామి, బాబు రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, రైతు విభాగం మండల కార్యదర్శి సిద్ధం మౌలాలి రెడ్డి, గోపాల్ రెడ్డి, పిట్ట పెద్ద రామ సుబ్బారెడ్డి తో పాటు మండలంలోని అన్ని గ్రామాల వైసిపి నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

### ఆర్డీవో జోక్యంతో ఆందోళన విరమణ

ఆత్మకూరు ఆర్డిఓ వెంకట శివ జోక్యంతో వెలుగోడు రిజర్వాయర్ ను ముట్టడించే కార్యక్రమానికి తెరపడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆర్డిఓ వెంకట శివ వైసిపి నాయకులు బండి ఆత్మకూరులో నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో తాగునీటికి మాత్రమే నీటిని వదిలేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో వినాయక ఉత్సవాలు జరుగుతున్న కారణంగా, నిమజ్జనానికి నీళ్లు కూడా అవసరం ఉంటుందని ఆర్డిఓ చెప్పారు. తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని అన్ని చెరువులను నింపడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయవాడ వెళ్లిన కారణంగా తాగునీటి విషయంలో కలెక్టర్ వచ్చిన తర్వాత సాగునీటి విషయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారని ఆర్డిఓ రైతులకు సూచించారు. ఆర్డిఓ హామీతో ఆందోళన కార్యక్రమాన్ని విరమింప చేసుకుంటున్నామని మాజీ ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి ప్రకటించారు. సాగునీటి విషయంలో ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనకపోతే, తిరిగి ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని శిల్పా పేర్కొన్నారు. వైసీపీ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ఆందోళన కార్యక్రమం విజయవంతమైంది.

### శ్రమించిన పోలీసులు

వైసిపి నాయకులు రైతులు వెలుగోడు రిజర్వాయర్ ను ముట్టడించే విషయంలో పోలీస్ యంత్రాంగం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రెండు రోజుల నుండి ట్రాక్టర్ యజమానులకు నోటీసులిచ్చే పనిలో గ్రామాలు పట్టుకొని తిరగాల్సి వచ్చింది. తిరిగి ఆందోళన కార్యక్రమానికి ముందు రోజే ప్రధాన రహదారులలో చెక్ పోస్టు నిర్వహించి తనిఖీలను నిర్వహించారు. వెలుగోడు రిజర్వాయర్ కు వెళ్లే రహదారుల్లో, తెలుగు గంగ కాలువల వద్ద, బండి ఆత్మకూరు, పెద్దదేవలాపురం, వెలుగోడు మండలం మోత్కూరు వద్ద, పోలీస్ యంత్రాంగం పెద్ద ఎత్తున మెహరించింది. బండి ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యేలు శిల్పాచక్రపాణి రెడ్డి, రవి కిషోర్ రెడ్డిలను అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో కార్యకర్తల నుండి తోపులాటలు ప్రతిఘటనలు ఎదురైనప్పటికీ పోలీసులు సమయమనం పాటించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో నంద్యాల రూరల్ శ్రీనివాస్ రెడ్డి బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్ పోలీసులు అవస్థలు పడ్డారు. మహానంది, బండి ఆత్మకూరు, వెలుగోడు పోలీస్ స్టేషన్లో ఎస్సైలు మహేశ్వర్ రెడ్డి జగన్మోహన్ సురేష్, బందోబస్తు చర్యలు చేపట్టడంలో తలమునకలయ్యారు.

---

### పదో తరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని

# లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి,

● చదువే పేదరికాన్ని అధిగమించి, జీవితాలను మార్చే శక్తివంతమైన సాధనం, ● సాంకేతికతను సద్వినియోగం చేసుకొని జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలి,,● జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



నందవరం పల్లె వెలుగు సెప్టెంబర్ 01 పదో తరగతి విద్యార్థులు ప్రస్తుత సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా చదువుపై పూర్తి దృష్టి సారించి, ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్య సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సూచించారు. నందవరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరికీ సమస్యలు, కష్టాలు ఎదురవుతాయని, వాటికి భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. పేదరికం, ఆరోగ్య సమస్యలు, ఇతర ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఉన్నత స్థానాలకు చేరుకున్న వారు అనేక మంది ఉన్నారని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, ఈ దశలో సాధించే ఫలితాలు భవిష్యత్ విద్యా, ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడతాయని తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ వంటి ఉన్నత విద్యను పూర్తి చేసి, ముందుగా తమ కాళ్లపై తాము నిలబడే స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పిల్లల చదువు ద్వారానే కుటుంబ ఆర్థిక పరిస్థితులను మార్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం పోటీ తీవ్రంగా పెరిగిన నేపథ్యంలో ఆసక్తితో, ప్రణాళికాబద్ధంగా కష్టపడాలని



సూచించారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, క్రమశిక్షణతో చదువుతూ రేపటి పనిని నేటికే పూర్తి చేసే అలవాటు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యున్నత స్థానాలకు చేరుకున్న వారిని ఆదర్శంగా తీసుకొని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం సాంకేతికత ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న జ్ఞానం విద్యార్థులకు అందుబాటులో ఉందని, మొబైల్ ఫోన్లను కేవలం వినోదం కోసమే కాకుండా సందేహాల నివృత్తి, కొత్త విషయాల అధ్యయనం, భాషల అభ్యాసం వంటి విద్యా అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులను సందేహాలు అడిగి నివృత్తి చేసుకోవడంతో పాటు, డిజిటల్ విద్యా వనరులు, కృత్రిమ మేధస్సు ఆధారిత సాధనాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని తెలిపారు. విద్యార్థులు అందరితో స్నేహపూర్వకంగా మెలగాలని, ద్వేషం, ఈర్ష్య, అసూయ వంటి భావాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా నిరాశ చెందకుండా ధైర్యం, దృఢ సంకల్పంతో వాటిని అధిగమించాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులు ప్రస్తావించిన తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.. "మీ జీవితాన్ని మార్చే శక్తి మీలోనే ఉంది. ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణతో కష్టపడి చదివితే మీ భవిష్యత్తుతో పాటు మీ జీవితాలను కూడా మార్చగలుగుతారు" అని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఇంట్లో తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేయాలని ప్రయత్నించినట్లయితే వెంటనే సంబంధిత ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విద్యార్థినులకు సూచించారు. ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి, ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ కాళ్లపై తాము నిలబడిన తర్వాతే వివాహం గురించి ఆలోచించాలని కలెక్టర్ సూచించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు సంబంధించిన అసెస్మెంట్ పుస్తకాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి, వారి విద్యా ప్రగతి మరియు అభ్యసన స్థాయిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణ దేవి, సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు, తహశీల్దార్ అబ్దుల్ వహెబ్, ఎంపీడీవో పుల్లయ్య, ఎం ఈ ఓ గోవింద పాల్గొన్నారు



---

## పీఎన్ఎస్ రాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**-20 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు -సహాయం అన్నవారికి రాయుడు చేయుత**

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన




హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇండియా స్టేట్ ప్రెసిడెంట్ పిఎన్ఎస్ రాయుడు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మంగళవారం నంద్యాల పట్టణం ఎస్ ఆర్ బి సి కాలనీలోని పరివర్తన్ హెచ్ఐవి ఎయిడ్స్ కేంద్రం నందు వ్యాధిగ్రస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన సొంత నిధులతో సహాయం అన్న వారికి చేయూత అందిస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్నారు. ఆయన మాట్లాడుతూ..అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదన్నారు. హ్యూమన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులపై విపక్షత చూపకూడదన్నారు. హెచ్ఐవి వ్యాధి పట్ల యువత, ప్రజలు అవగాహన కలిగి ఉండడం వల్ల గురికాకుండా చూసుకోవచ్చన్నారు. చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు.

## జగన్‌ను కలిసిన రెడ్యం వెంకట సుబ్బారెడ్డి



కడపపల్లె వెలుగు ప్రతినిధి సెప్టెంబర్ 01 వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్ బాషా, మాజీ మేయర్ సురేష్ బాబు పాల్గొన్నారు

## ప్రజా సంక్షేమమే ఎన్.డి.ఎ కూటమి ప్రభుత్వ ప్రథమ లక్ష్యం

పల్లె వెలుగు బేతంచెర్ల, సెప్టెంబర్ 01: ప్రజల సంక్షేమమే ఎన్.డి.ఎ కూటమి ప్రభుత్వ



ప్రథమ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాసరెడ్డి, 227వ బూత్ ఇంచార్జి రాచపోగుల ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం బేతంచెర్ల మండలంలోని బలపాలపల్లె గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కొలుములపల్లె స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు కార్యాలయం వీఆర్ఓ రామగోపాల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్, విలేజ్ సర్వేయర్ మంజునాథ్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థికంగా ఊరట లభిస్తుందన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి చేరవేయడమే కూటమి ప్రభుత్వ బాధ్యతని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎన్డీఏ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. పౌలయ్య, పిక్కిలి పెద్ద మాదన్నతో పాటు బలపాలపల్లె గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.ద

### మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

## నివాళుల కార్యక్రమం

**బేతంచెర్ల వైసీపీ పార్టీ కార్యాలయం పిలుపు**


బేతంచర్ల పల్లె వెలుగు ప్రతినిధి సెప్టెంబర్ 01:-- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన




జననేత, సంక్షేమ శ్రామికుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా బేతంచెర్లలో నివాళుల కార్యక్రమం నిర్వహించబడుతుందని సెప్టెంబర్ 02, బుధవారం (రేపు)ఉదయం 09:00 గంటలకుబేతంచెర్ల పట్టణం, శేషారెడ్డి హై స్కూల్ దగ్గర ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరుగుతుందనీ కావున బేతంచెర్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, అన్ని అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, వైఎస్సార్ అభిమానులు అందరూ ఉదయం 9 గంటలకు బేతంచెర్ల వైఎస్ఆర్సీపీ పార్టీ కార్యాలయం వద్దకు చేరుకొని, పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు నివాళులు అర్పించవలసిందిగా బేతంచర్ల వైసీపీ కార్యాలయం వారు ప్రకటనలో తెలిపారు.

## మహిళలకు రాజకీయ ప్రాధాన్యం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత




పెంచాలని ఎస్డీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. నంద్యాలలో ఉమెన్ ఇండియా మూవ్‌మెంట్ జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షురాలు అడ్వకేట్ నయ్యి మున్నీసా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షురాలిగా జరీనా బేగం, ఉపాధ్యక్షురాలిగా నూర్జహాన్, ప్రధాన కార్యదర్శిగా తస్లీమా, కార్యదర్శిగా సబిహ, కోశాధికారిగా షేక్ నసీమా ఎన్నికయ్యారు. మరో ఆరుగురిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్డీపీఐ జిల్లా నాయకులు అబ్దుల్ కలాం, ఏజస్ హుస్సేన్ మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధితో పాటు రాజకీయాల్లోనూ చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఎస్డీపీఐ కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షురాలు నయ్యి మున్నీసా మాట్లాడుతూ మహిళల హక్కులు, సాధికారత కోసం నూతన కమిటీ నిరంతరం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా, అసెంబ్లీ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి చేతి గడియారం

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి



మృతి చెంది బుధవారం నాటికి 17 సంవత్సరాలు అవుతుంది. వైయస్ వర్ధంతి ప్రతి ఏటా జరుగుతున్న సందర్భంలో ఆయన ధరించే చేతి గడియారం గురించి ఓ సంఘటన పదేపదే గుర్తుకు వస్తూ ఉంటుంది. ఈ విషయాన్ని పాఠకులతో పంచుకోవాలని తలచి వెలుగులోకి తెస్తున్నాను. ఆత్మకూర్ పరిసర ప్రాంతాలలో హెలికాప్టర్ ప్రమాదంలో వైయస్సార్ మృతి చెందిన నేపథ్యంలో, ఆయన చేతికి ఉన్న గడియారం అటవీ ప్రాంతంలో పడిపోయింది. వైయస్సార్ నల్లమల ప్రాంతంలో మృతి చెందారు అన్న దుర్ఘటనను తెలిసిన వెంటనే చాలామంది అభిమానులు ఆ ప్రాంతానికి చేరుకోవడం జరిగింది. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్నపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి వైఎస్ఆర్ చేతి గడియారం దొరికింది. ఈ విషయం అక్కడ ఇక్కడ చేరి నా చెవిన బడింది. వెంటనే ఈ విషయాన్ని అప్పటి బండి ఆత్మకూరు ఎస్సై చక్రవర్తికి సమాచారం అందించాను. ఈ విషయాన్ని ఆయన తేలికగా తీసుకున్నారు. అదేంటి సార్! వైయస్ ఆర్ వాచి గురించి సమాచారం అందిస్తే తేలికగా తీసి పారేశారు. తీసుకొని వెళ్లి వారి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోండి! ఈ క్రెడిట్ మీకు కూడా దక్కుతుంది అని చెప్పాను. వెంటనే ఎస్ఐ చక్రవర్తి పార్నపల్లె లో విచారించి వైయస్ గడియారాన్ని తీసుకొని వచ్చారు. గడియారాన్ని వెంటనే అప్పటి కర్నూలు జిల్లా ఎస్పీ నాగిరెడ్డికి అందించారు. తర్వాత ఎస్పీ నాగిరెడ్డి గారు ఆ గడియారాన్ని కడపలో వైఎస్ కుటుంబానికి చేర్చడం జరిగింది. వైయస్సార్ వర్ధంతి జరిగినప్పుడల్లా ఈ గడియారం సంఘటన ఎప్పుడూ నాకు గుర్తుకు వస్తూ ఉంటుంది. గడియారాన్ని పలు సందర్భాల్లో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కూడా ధరిస్తూ ఉంటారని విన్నాను. వయసు వర్ధంతి జరిగినప్పుడు అంతా ఎప్పుడు గడియారం గురించి నాకు గుర్తుకు వస్తూ ఉంటుంది. వైయస్ గడియారం గురించి కథ అది అన్నమాట.

**రసూల్ పల్లె వెలుగు జర్నలిస్టు**
**బండి ఆత్మకూరు**

## కొలిచిన వారికి కొంగు బంగారం రణ మండల ఆంజనేయస్వామి

**అంజనీ పుత్ర శ్రీ రణ మండల ఆంజనేయ స్వామి వారికి విశేష పూజలు.**






ఆదోని(పల్లె వెలుగు): ఆదోని కొండల్లో వెలిసిన మండల ఆంజనేయస్వామి వారికి శ్రావణ మాసం సందర్భంగా 31.08.2026 న సద్గురు కీ.శే. కత్తి ఈరణ్ణ స్వామి వారి భక్త బృంద వారిచే విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్య క్రమములో ప్రముఖులు దేవి శెట్టి ప్రకాష్ కాంగ్రెస్ నాయకులు, దస్తగిరి నాయుడు బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీరామ్, భీమ్ నాయుడు, చిన్న ఈరప్ప, రామకృష్ణ, ఎల్లప్ప, ఆర్ వి మోహన్ బాబు, లక్ష్మీనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములు కత్తి వంశ పారంపర్య కుటుంభ సభ్యులు ఆధ్వర్యంలో కత్తి హనుమంత రావు, రవీంద్ర, నాగప్రసాద్, శ్రీకాంత్ సాయికిరణ్ వీరందరి సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం నాకు పెద్ద ఎత్తున భక్తులు, భక్తాదులు, మరియు విశేషముగా మహిళలు పాల్గొన్నారు.

## బహుశా 2026--2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల ఇంట్రామ్యూరల్స్ క్రీడా పోటీలు..

**జ్యోతి ప్రజ్వలన చేసిన సహకార సంఘం అధ్యక్షులు దేశం సత్యనారాయణ రెడ్డి..**



గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించిన ఈ కార్యక్రమానికి గడివేముల సహకార సంఘం అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, శివనాగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను జ్యోతి ప్రజ్వలన ద్వారా ప్రారంభించారు , విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరం అలాంటి వాటిలో పాల్గొనడం గెలుపొందిన విద్యార్థులకు బహుమతి అందుకోవడంలో ఉన్న ఆనందం చాలా గర్వంగా ఉంటుందని తెలియజేశారు, అదేవిధంగా పాఠశాలలో ఇలాంటి క్రీడలు నిర్వహిస్తున్న తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేస్తూ ఇంట్రామ్యూరల్స్ (2026--2027) నిర్దిష్ట విద్యా సంస్థలో జరగబోయే ఇంట్రామ్యూరల్ క్రీడలషెడ్యూల్ కోసం ప్రధాన టోర్నమెంట్‌లను ఫాల్ 2026 మరియు వింటర్/స్ప్రింగ్ 2027 సెమిస్టర్‌ల మధ్య విభజించి సాధారణంగా కనిపించే క్రీడలు:సాధారణంగా బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, సాకర్, బ్యాడ్మింటన్మరియు సాంప్రదాయ బోర్డ్ గేమ్‌ల వంటి ప్రధాన ఈవెంట్‌లు ఉంటాయి . 2. అండర్-17 (ఖ17) జాతీయ పాఠశాల క్రీడలు (2026--2027)మీరు అధికారిక విద్యార్థి క్రీడా తమ పోటీ నిర్మాణాలను నిర్దిష్ట యువ శ్రేణుల వారీగా నిర్వహిస్తాయి:వయో విభాగాలు: బాలురు మరియు బాలికలు ఇద్దరికీఆటలు కచ్చితంగా అండర్-14, అండర్-17మరియు అండర్-19 విభాగాలుగా విభజించబడ్డాయి . టోర్నమెంట్ మార్గం:పోటీలు ప్రాంతీయ క్లస్టర్‌లు మరియు జోనల్‌ల ద్వారా ముందుకు సాగి, జాతీయ పాఠశాల క్రీడలతో ముగుస్తాయి ప్రధాన బహుళ క్రీడా పోటీలుఒకవేళ మీరు 2027లో జరగనున్న ఒక భారీ, స్థూల-స్థాయి బహుళ-క్రీడా కార్యక్రమం గురించి 39 వ జాతీయ క్రీడలు గురించి ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుల స్కూల్ అధ్యాపక యాజమాన్యం విద్యార్థి విద్యార్థులు పాల్గొని ఘనంగా నిర్వహించారు గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా సత్యనారాయణ రెడ్డి, శివ నాగి రెడ్డి అధ్యాపక బృందం పాఠశాల యాజమాన్యం వారి చేతుల మీదుగా బహుమతులు అందించడం జరిగింది..



## 26, 27 వార్డుల్లో 'ఇంటింటికీ తెలుగుదేశం'

**-ప్రజల ముంగిటకే కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి: మంత్రి ఎన్ఎండి ఫరూక్**

నంద్యాల పల్లె వెలుగు సెప్టెంబర్ 01 కూటమి ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలు ప్రతి పేద కుటుంబానికి అందుతున్నాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. స్థానిక 26 మరియు 27 వ వార్డులలో దేవనగర్ పరిసర ప్రాంతాలలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వార్డులోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి, కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు అందజేస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకుంటున్నాం అన్నారు . ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని . యువత భవిష్యత్తు, పేదల సంక్షేమం, మహిళల సాధికారత, విద్య, ఉపాధి, మౌలిక వసతుల కల్పనకు మన కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు . చంద్రన్న సంక్షేమ పాలనపై నంద్యాల ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని అన్నారు . ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నాయకత్వానికి నంద్యాల ప్రజలు పూర్తి మద్దతుగా



నిలుస్తున్నారని మంత్రి ఫరూక్ తెలిపారు . ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జెల్లిపల్లి దిలీప్ కుమార్, జెల్లిపల్లి అశోక్ కుమార్ , మాజీ కౌన్సిలర్, కార్పొరేషన్
డైరెక్టర్ దూదేకుల దస్తగిరి, జైనాబి, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, చూరి, మాజీ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, మిద్దె ఉసేని , కొండారెడ్డి, కృపాకర్, కాజా హుస్సేన్, హరుణ్ బేగ్ , జోసఫ్ మరియు టిడిపి నాయకులు , కార్యకర్తలు , అభిమానులు , ప్రజలు తదితరులు పాల్గొన్నారు


# వీడు సామాన్యుడు కాదు.

☛ఎవరేమనుకుంటే నాకేంటి హోదా వదులుకునేది లేదు.

☛అంత నా ఇష్టం.

**పల్లె వెలుగు నంద్యాల ప్రతినిధి.**

వీడు సామాన్యుడు కాదు... ఎవరేమనుకుంటే నాకేంటి.. హోదా వదులుకునేదే లేదు... "అంతా నా ఇష్టం" అంటూ ఒక నగరానికి చెందిన జంతర్ మంతర్ దకాటి బాబా ఇష్టానుసారముగా వ్యవహరిస్తూ అందిన కాడికి దోచుకుంటూ, కోట్ల సొమ్మును కూడబెడుతూ తప్పుడు లెక్కలు, తప్పుడు రాతలు చూపిస్తూ, కోట్లకు పడగలెత్తుతున్నాడని, ఆ నగరానికి చెందిన కొంతమంది వ్యక్తులు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... ఆ నగరంలో గతంలో పనిచేసిన కొంతమంది వ్యక్తులు అధ్యక్ష పదవులు చేపట్టి, ఆ నగరాన్ని అభివృద్ధి బాటలో నడిపించారని పలువురు అంటున్నారు. ఇప్పుడు ఉన్న జంతర్ మంతర్ దకాటి బాబా ఆ నగరానికి అధ్యక్షులుగా వ్యవహరిస్తూ ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ, ఎవరేం చెప్పినా, ఎవరు మొహం మీద ఉమ్మేసినా, ఆ నగరపు అధ్యక్ష పదవి వదులుకునేది లేదని, బాహాటంగానే చెప్పుకుంటున్నాడు. అధ్యక్ష పదవి వదులుకున్న కొన్ని గంటల్లోనే కటకటాల పాలు అవుతాడని, ఆ నగరానికి అధ్యక్ష పదవిగా వ్యవహరిస్తూ తన పబ్బం గడుపుకుంటూ కాలం వెళ్లబుచ్చుకున్నట్లు ఆ నగరవాసులు చర్చించుకుంటున్నారు. ఆ నగరానికి ఇప్పుడు అధ్యక్ష పదవిగా వ్యవహరిస్తు ఆ నగరంలో అవినీతికి పాల్పడుతూ, జంతర్ మంతర్ దకాటి బాబా పాత సామాన్లు కొని పాత సామాన్లు అమ్ముకుంటూ కోట్లకు పడగెత్తినట్లు ఆ నగరవాసుల నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి. జంతర్ మంతర్ దకాటి బాబా ముందుకే చిన్న చిట్కా మనిషిని, ఆ నగరానికి అధ్యక్ష పదవి చేపట్టినప్పటికీ ఆ నగరంలో దోచుకుంటూ ఆ నగరంలో ఉన్న స్థలాలు , స్థలము యజమానులకు తెలియకుండా కొక్కుల బొక్కేసినట్టు భోంచేస్తున్నాడని ఆ నగర వాసుల నుండి ఘాటుగా విమర్శలు వస్తున్నాయి. జంతర్ మంతర్ దకాటి బాబా దగ్గరికి వెళ్లిన సంఘాలకు,ఇతరత్రా యాడ్స్ వారికి వేలకు వేలు వ్రాయించి, ఆ నగరంలో ఉన్న వ్యక్తులకు యాడ్స్ వారికి యాడ్స్ డబ్బులు నెలలు, సంవత్సరమైన ఇవ్వకుండా ఎగనామము పెట్టి, వేలకు వేలు ఇచ్చినట్లు ఆ నగర పుస్తకములో తప్పుడు లెక్కలు చూపిస్తూ ప్రతి ఒక్కరికి పది రూపాయలు ఇచ్చి వెయ్యి రూపాయలు లెక్కలు రాసుకుంటూ ఆ నగరానికి అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నాడని, అతనిపై ఆ నగరవాసులు ఎన్ని నిందలు మోపిన నిందలు మోస్తూ రోసానికి పోకుండా అధ్యక్ష పదవిలో చలామణి అవుతున్నాడని పలువురు ఆ నగరవాసులు బహిరంగముగా చర్చించుకుంటున్నారు. ఏదేమైనా జంతర్ మంతర్ దకాటి బాబాకు చీము, నెత్తురు, రోషం ఉంటే ఆ నగరంలో చేసిన అభివృద్ధి చూపించి ఆ నగరవాసులు ఇతనిపై మోపిన నిందలకు ఎప్పుడో రాజీనామా చేసేవాడని, రాజీనామా చేస్తే ఆ నగర వాసులు తన తప్పులు బయటపెట్టి కటకటాలకు పంపిస్తారని, ఆ నగరానికి అధ్యక్ష పదవి వదులుకోకుండా వ్యవహరిస్తున్నాడని ఆ నగరవాసులు వాపోతున్నారు. ఏదేమైనా కూటమి ప్రభుత్వం ఆ నగరముపై ప్రత్యేక నిఘా ఉంచి జంతర్ మంతర్ దకాటి బాబా చేసిన తప్పులు బయటపెట్టి అతనికి గుణపాఠం చెప్పే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు ఆ నగరవాసులు కోరుతున్నారు.



## చంద్రబాబు చేపట్టిన జలహారతికి సంఘీభావంగా రైతుల భారీ ర్యాలీ ట్రాక్టర్ నడిపిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, సెప్టెంబర్ 1 పల్లె వెలుగు ఉత్తరాంధ్ర రైతుల దాహార్తిని తీర్చేందుకు గోదావరి జలాలను అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వరకు తరలించేందుకు సెప్టెంబర్ 2న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జరగనున్న జలహారతికి సంఘీభావంగా కాకినాడ జిల్లాలో రైతులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. పోలవరం ఎడమ కాలువ ఆయకట్టు రైతులు గండేపల్లి మండలం మురారి గ్రామం నుండి కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం వరకు వందలాది ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ రైతులతో కలిసి మురారి నుండి సోమవరం వరకు ర్యాలీలో పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపులా రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం సోమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సూపర్ ఎల్ నినో ప్రభావంతో రాబోయే రెండేళ్లు తీవ్ర కరువు పరిస్థితులు ఉంటాయని ముందే పసిగట్టిన విజనరీ నాయకుడు చంద్రబాబు అని అన్నారు. కరువును ముందే గ్రహించి రైతులను ఆదుకోవాలనే సంకల్పంతోనే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా పాయకరావుపేట వరకు తీసుకెళ్లే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. చంద్రబాబు కష్టాన్ని కూడా అవకాశంగా మార్చే నాయకుడు అని, ఆయన ముందుచూపు వల్లే రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి కొరత లేకుండా చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. పోలవరం పూర్తయితే ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల రైతుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మే నాయకుడు చంద్రబాబు అని అన్నారు. 31 సంవత్సరాల క్రితం ఇదే రోజున చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని, అదే స్ఫూర్తితో రైతుల సంక్షేమం కోసం ఈ సంఘీభావ ర్యాలీ చేపట్టామని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ రైతులు తరఫున చంద్రబాబుకు పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, బస్వా వీరబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, పోతుల మోహన రావు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్, పైడిపాల సూరిబాబు, ఉంగరాల రాము, తోట రవి, తోట గాంధీ, కంటిపూడి సత్యనారాయణ, పిల్ల చంటిబాబు, కుంచె రాజా, చదరం చంటిబాబు, జంపన రవి వర్మ, రాష్ట్ర, జిల్లా టీడీపీ నాయకులు, సొసైటీ చైర్మన్లు, క్లస్టర్ ఇంచార్జిలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రాజమండ్రిలో కళ్యాణ్ జ్యువెలర్స్ సరికొత్త షోరూమ్

### అట్టహాసంగా ప్రారంభించిన నటుడు అక్కినేని నాగార్జున







రాజమండ్రి, సెప్టెంబర్ 01 పల్లె వెలుగు ప్రముఖ ఆభరణాల సంస్థ కళ్యాణ్ జ్యువెలర్స్ తమ సరికొత్త షోరూమ్‌ను రాజమండ్రిలోని మల్లినా నగర్‌లో ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రాంతంలో వ్యాపార విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ విలాసవంతమైన షోరూమ్‌ను ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున ప్రారంభించారు. స్థానిక వినియోగదారులకు అత్యుత్తమ షాపింగ్ అనుభూతిని అందించే లక్ష్యంతో సరికొత్త డిజైన్లతో ఈ షోరూమ్‌ను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా నటుడు అక్కినేని నాగార్జున మాట్లాడుతూ నమ్మకం, పారదర్శకత, వినియోగదారుల సంతృప్తి వంటి ఉన్నత విలువలతో ముందుకు సాగుతున్న కళ్యాణ్ జ్యువెలర్స్‌తో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రాజమండ్రి ప్రజలు ఈ బ్రాండ్ అందిస్తున్న ఉన్నత సేవా ప్రమాణాలను, వైవిధ్యభరితమైన సరికొత్త ఆభరణాల శ్రేణిని ఆదరించి తమ ఆశీస్సులు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కళ్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణరామన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో విస్తరణలో భాగంగా వినియోగదారుల మారుతున్న అవసరాలను తీర్చే ఒక సమగ్ర షాపింగ్ వేదికను అందించాలనే లక్ష్యంతో ఈ షోరూమ్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆభరణాల తయారీ విలువపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఆఫర్లను అందిస్తున్నామని, పరిమిత కాలం పాటు ప్రత్యేక గోల్డ్ బోర్డ్ రేటు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ షోరూమ్‌లో లభించే ఆభరణాలన్నీ నాణ్యతా ప్రమాణాల పరీక్షలతో కూడిన బీఐఎస్ హాల్‌మార్క్ కలిగి ఉంటాయని, బంగారం స్వచ్ఛత, జీవితకాల ఉచిత నిర్వహణ, పారదర్శక బై బ్యాక్ విధానంతో కూడిన 4 అంచెల హామీ పత్రం వినియోగదారులకు లభిస్తుందని తెలిపారు. షోరూమ్‌లో ముహూరత్, ముద్ర, నిమహ్, గ్లో, జియా, అనోఖి, అపూర్వ, అంతర, హీరా, రంగ్ మరియు ఇటీవల విడుదల చేసిన లీల వంటి ప్రత్యేక అంతర్గత బ్రాండ్ల కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయని యాజమాన్యం ప్రకటించింది

## పేదల ఇంటికే సంక్షేమ ఫలాలు ! శంకర్ రెడ్డి



సత్యవేడు, సెప్టెంబర్ 1 పల్లె వెలుగు సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలం అరణ్యం కండ్రిగ పంచాయతీ పరిధిలోని పడేటమ్మ ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లను స్వయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను నేరుగా చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు శంకర్ రెడ్డి పేర్కొన్నారు. పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నారాయణవనం మండల అధ్యక్షులు గిరిబాబు తో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి వైసిపి శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పిలుపు..




అనపర్తి నియోజికవర్గ ప్రతినిధి, కర్రిదుర్గారెడ్డి పల్లె వెలుగు అనపర్తి, సెప్టెంబర్ 01 : తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, అనపర్తినియోజకవర్గవైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2న వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులుపెద్దసంఖ్యలోపాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.
పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని పార్టీనాయకులు గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ,ఫీజురీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలిచిన నాయకుడిగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలు, సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఆయనకు ఘనమైన నివాళులుఅర్పించేలాప్రతిగ్రామంలో వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించాలనిడాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపు నిచ్చారు.

### కాపవరం,బలభద్రపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

## రైతులంతా ఫార్మర్ ఐడి పొందాలి..





అనపర్తి నియోజికవర్గ ప్రతినిధి, కర్రిదుర్గారెడ్డి పల్లె వెలుగు బలభద్రపురం, సెప్టెంబర్ 01 :తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంబిక్కవోలు మండలం కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో ఈరోజుపొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్కవోలు మండల వ్యవసాయ అధికారి జి. వాణి మాట్లాడుతూ రైతులందరూ తమ పొలాలను ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకుని రైతు గుర్తింపు కార్డు పొందాలని సూచించారు. భవిష్యత్తులో ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్లకు రైతు గుర్తింపు కార్డు తప్పనిసరి కానుందని తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో పంటల నమోదు ప్రక్రియ జరుగుతోందని, రైతులందరూ తమ పంట నమోదుకు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. పంట వివరాలు తప్పుగా నమోదై ఉంటే వెంటనే సరిచేయించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో ప్రస్తుత పంటల పరిస్థితిపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోన శ్రీనివాసు, గ్రామీణ ఉద్యానవన అధికారులు శ్రీనివాస్, శరత్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శిరీషతో పాటు కాపవరం, బలభద్రపురం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com